
కథ

# అనుబంధం

టి. మీనాక్షి



ట్రైన్ దాదర్ స్టేషన్‌లోకి వచ్చి ఆగింది. అంతకు ముందే ఎంట్రన్స్ దగ్గరకు సామాన్లు చేర్చి, పాపను ఎత్తుకుని నిలుచున్నాను. ఎప్పుడెప్పుడు స్టేషన్ వస్తుందా! అని ఎదురు చూస్తూ వున్నాను. నా ప్రాణం ఒడ్డున పడ్డ చేపలాగా విలవిలలాడుతోంది. ఎప్పుడెప్పుడు ఆయన్ని చూస్తానా అని ఆతృతలో వున్నాను. ఇన్నాళ్ళు ఆయన్ని విడిచి ఎలా వున్నానో అర్థం కాలేదు.

ఒక్కసారి ఆయన్ని చూస్తే చాలు, ఒక్కసారి ఆయన స్పర్శ చాలు నా ఈ ప్రాణం నిలవడానికి అనిపిస్తోంది.

ట్రైన్ బాగా స్లో అయింది. ఎంట్రన్స్ నుంచి బయటకు చూశాను. ఆయన నవ్వుతూ చేయి వూపారు. ప్రాణం లేచి వచ్చింది. ఎన్నేళ్ళయింది పెళ్ళయ్యి? ఆరేళ్ళు కావొస్తోంది. అయినా ఎప్పటికప్పుడు ఈ అనుభవం కొత్తగానే వుంటుంది. అందరికీ ఇంతేనా? ఏమో!

ఆయన ఎంట్రన్స్ దగ్గరకు వచ్చి మొదట పాపను అందుకున్నారు. ఆ తరువాత లగేజి దించారు. స్టేషన్ బయటకు వచ్చి టాక్సీలో కూర్చున్నాము. అంతే! అంతవరకూ లోపల అణచి పెట్టుకున్న ఆ భావన మనసు దాటి బయటికి వచ్చేసింది. ట్రైన్ ముంబయ్ లోకి ఎంటరయిన దగ్గర నుంచి టాక్సీలో కూర్చునేంత వరకూ ఆ ఫీలింగ్ ఎక్కడికి వెళ్ళిందో తెలియదు. ఆయన్ని చూసి, నాలుగు మాటలు మాట్లాడిన తరువాత, ప్రాణం లేచి వచ్చింది. మళ్ళీ ఆ ఫీలింగ్ మొదలైంది.

నాలాంటి వాళ్ళకి ఇలాంటి భావనలు ప్రతి ప్రయాణం లోనూ కలుగుతుంటాయేమో! ఇరవై రోజుల క్రితం పెళ్ళికని బయలుదేరి వెళ్ళాము. ఆయన పెళ్ళి అయిన తర్వాత తిరిగి వచ్చేశారు. ఇన్ని రోజుల వరకూ ఏవో పనుల హడావిడి వలన ఆయన గురించి అంతగా ఆలోచించలేదు. సమయం కూడా తెలియకుండా రోజులు గడిచాయి. పనులు అన్నీ అయి, బాగా [illegible] దొరికాక నెమ్మదిగా ఆయన మీద, ఇంటి మీద గాలి మళ్ళింది. ఇంక వుండలేననిపించింది. ఊపిరాడనట్టు అనిపించింది. వచ్చేశాను. కాని ట్రైన్ ఎంతో

నెమ్మదిగా నన్ను తీసుకువచ్చిందనిపిస్తోంది.

"ఏమిటోయ్ పరాకు! ఎక్కడున్నావ్. మనిషిక్కడే వున్నావ్ కాని మనసెక్కడో వున్నట్టుందే" అంటూ ఆటపట్టిస్తున్నారాయన. సమాధానంగా నేను ఆయన చేతిని నా చేతిలోకి తీసుకుని నొక్కాను నా ఆలోచనలు ఇక్కడే వున్నాయని చెప్పడానికి. చిన్నగా నవ్వాను.

మమ్మల్ని, మా భావాల్ని మోస్తూ టాక్సీ ఫాస్ట్‌గా వెడుతోంది. ప్రొద్దున అయిదు గంటలకు కాబట్టి ట్రాఫిక్ అనే సమస్యే లేదు. చల్లటి గాలి శరీరాన్ని పలకరిస్తోంది హాయిగా. ఇంకా రెండు గంటల తర్వాత చూస్తే ఈ రోడ్డు ఇలా వుంటుందా? ఇంత చల్లగా, కాలుష్యం లేకుండా వుంటుందా? ముందొక వెహికిల్, వెనకొక వెహికిల్, పక్కన ఎక్కడపడితే అక్కడ వాహనాలతో, అవి వెదజల్లే కాలుష్యంతో ఈ ప్రదేశమంతా నిండిపోతుంది. ముంబయ్ ఎలా వుంటుందో తెలియాలంటే తెల్లవారు ఝామున ప్రయాణం చేస్తే అర్థం కాదు.

మరి అలాంటప్పుడు నేను ఈ మహానగరానికి ఏముందని ఇంత హడావిడిగా వచ్చేశాను? తలెత్తి చూస్తే ఆకాశం కూడా సరిగ్గా కన్పించదు. మొదట కన్పించేవి ఇరవై అంతస్తుల ఆకాశ హర్మ్యాలు. ఆ తరువాత ఫ్లై ఓవర్ బ్రిడ్జీలు. స్కూటర్‌పై బయటికి వచ్చేవారు అర గంటలో చేరుకోవలసిన గమ్యం గంటన్నరకు గాని చేరుకోలేరు. ట్రాఫిక్ జామ్‌లో వున్నవాళ్ళు పద్మవ్యూహంలో చిక్కుకున్న వాళ్ళలాగా నాలుగు ప్రక్కలా వాహనాలతో, పొగలో చిక్కుబడిపోతారు. ఆ పొగ కళ్ళల్లో దూరి కళ్ళు మంటలు పుడతాయి. ట్రాఫిక్ వెసులుబాటు కోసం ఫ్లై ఓవర్ బ్రిడ్జీలు కట్టారు. వాటి మీద కూడా ట్రాఫిక్ జామ్ అయితే ఆదుకోవడానికి ఇంకేం నిర్మిస్తారు?

అదే మా వూరిలో అయితే తలెత్తితే కనపడే నీలాకాశం. తెలవారితే ఇంటి ముందు కనపడే ముగ్గులు, కళ్ళాపి చల్లి ముగ్గులు పెట్టేవాళ్ళు, పూలు కోసుకునే వాళ్ళు, స్వచ్ఛమైన గాలి. ఏవీ ఇవన్నీ ఇక్కడ? ఏవీ వుండవని తెలిసీ తను ఇంత హడావిడిగా ఎందుకు బయలు దేరింది ఎందుకో?

నా ఆలోచనలను పసి గట్టినట్టున్నారు మా వారు. నెమ్మదిగా నా చేయి అందుకున్నారు. ఆ స్పర్శ నాకెంతో హాయినిచ్చింది. ఇందాకటి అశాంత పుటాలోచనలను ఒక్కపెట్టున పారద్రోలింది. పాప ఆయన దగ్గరే వుంది. మెల్లిగా నిద్రలోకి జారుతోంది.

ఆయన పుట్టి పెరిగింది ఇక్కడే. పెళ్ళయి ఇక్కడ వుండడానికి వచ్చినదాన్ని నేను. ఆయన ఈ వాతావరణంలో హాయిగా వుంటారు. కేవలం ఆయన కోసం వచ్చి ఇక్కడ అడ్జెస్టయినదాన్ని.

టాక్సీ కాలనీలోకి వచ్చి ఆగింది. మా వాటా రెండవ అంతస్తులో వుంది. ఇంట్లోకి గాలి బాగానే వస్తుంది. కాని—సాయంత్రాలు బయటికి వచ్చి కూర్చోవడాలు, మాట్లాడుకోవడాలు ఎక్కువగా వుండవు. ఒకవేళ మాట్లాడినా 'హలో' అనడాలు లేదా ఒకటి రెండు పొడి మాటలు. అంతే. ఎందుకంటే మా కాలనీలో పనిచేసే ఆడవాళ్ళు ఎక్కువ. వాళ్ళు ఆఫీసు నుంచి వచ్చేసరికి చీకటి పడుతుంది. హడావిడిగా ఇంటికి రావడం, పిల్లలను చూసుకోవడం, చదివించడం, వండుకోవడం... వీటితోనే సరిపోతుంది. ఇక్కడ వాళ్ళకు ఎక్కువ టైమ్ ప్రయాణంలోనే వృధా అవుతుంది.



సల్మాన్ ఖాన్ పాఠాలు

సెక్స్ ఎద్యుకేషన్‌ని కాలేజీల్లో తప్పని సరి చేస్తే కనుక సల్మాన్ ఖాన్‌కి అందులో ప్రొఫెసరు ఉద్యోగం ఖాయం. ఎందుకంటే ఎయిడ్స్ గురించి మాట్లాడుతూ సర్కస్‌లో గాల్లో విన్యాసాలు చేసే వాళ్లకింద నెట్ ఎంత అవసరమో, సెక్స్‌లో కండోమ్ కూడా అంతే అవసరం అని పోలిక చెప్పే సరికి అందరూ హాప్! అనుకుంటున్నారు.

మా ఊర్లో కూడా ఆడవాళ్ళు ఉద్యోగాలు చేస్తారు. కాని ఇంత సమయం ప్రయాణాలలో వృధా కాదు. కాబట్టి నలుగురితో మాట్లాడటాలు, ఇంట్లో వుండే సమయాలు ఎక్కువగా వుంటాయి.

ఇవన్నీ తెలుసు నాకు. ఆయన ఆఫీసుకు వెడితే ఒక్కదానినే ఆ పనీ, ఈ పనీ చేసుకుంటూ వుండాలి. అదే నా కాలక్షేపం. ఇది కాక పాప వుండనే ఉంది. రోజు తెలియకుండా వుండడానికి. ఇదీ ఇక్కడ నా లోకం.

మరి ఇన్ని తెలిసిన దానిని ఎందుకింత ఆత్రంగా వున్నట్టుండి బయలుదేరి వచ్చాను? ఆయన నన్ను రమ్మని తొందర కూడా చేయలేదు? మరి?

పాపను అందుకుని నేను టాక్సీ దిగాను. నెమ్మదిగా లిఫ్ట్ వైపు నడుస్తుంటే సామాను తీసుకుని ఆయన వచ్చారు.

ఆయన వైపు చూశాను. ఆనందం అంతా ఆయన మొహంలోనే వున్నట్టుంది. ఇన్నాళ్ళూ నేను అక్కడే వున్నా ఒక్కనాడూ ఆయన నన్ను రమ్మని తొందరపెట్టలేదు. "ఎప్పుడు వస్తున్నావు? ఫలానా రోజుకల్లా వచ్చేయి!" అని చెప్పలేదు. అలా అని మా మీద ఆసక్తి, ప్రేమ లేకనా? కానే కాదు. ఎదుటి మనిషికి ఏం కావాలో తెలిసిన మనిషి, తను మమ్మల్ని ఎంతగా మిస్ అవుతున్నా నాకోసం, నా సంతోషం ఎక్కడ పాడవుతుందోనని నేను వచ్చేవరకూ మాకోసం ఎంతో ఓపికతో ఎదురు చూశారు.

ఆయన తన వద్ద వున్న తాళంచెవితో తలుపు తెరిచారు. ఒక్కసారి స్వర్గం లోకి అడుగుపెట్టినట్టు అయింది.

'ఎలా వుంది ఇల్లు?" శుభ్రంగానే వుంచానా?" ఎంతో ప్రేమగా అడిగారు. ఇల్లు నిజంగానే ఎంతో శుభ్రంగా వుంది. మంచాల మీద చక్కగా ఉతికిన దుప్పట్లు వేసి వుంచారు. ఎక్కడి సామాన్లు అక్కడే నీట్‌గా సర్ది వున్నాయి. గదిలో ఒకమూల చిన్న గులాబీ మొక్క, కుండీలో పెట్టినట్టున్నారు. చిన్న పూవు పూసింది. పుట్టింటికి వెళ్ళొచ్చాక ఇల్లు నీట్‌గా సర్దిపెట్టి వుంటే భార్యకు ఎంత రిలీఫ్‌గా వుంటుందో?

పాపను మంచం మీద పడుకోబెడుతూ అన్నారు, "మొహం కడుక్కో! వేడిగా మంచి కాఫీ ఇస్తాను" అని.

నేను మంచం మీద ఆయన పక్కనే కూర్చున్నాను. ఆయన నా ముంగురులు సవరిస్తున్నారు. నేనా చేతిని నా చేతిలోకి తీసుకుని సున్నితంగా నొక్కుతూ ఆయన వైపు చూశా. ఆయన కళ్ళల్లో ఆనందం ఉట్టిపడుతోంది. ఇన్నాళ్ళూ ఆయనకెంతో ప్రియమైన పాపను వదిలి ఎలా వుండగలిగారో? ఎన్నేళ్ళ తరువాతో మమ్మల్ని చూస్తున్నట్టు ఆయన కళ్ళల్లో వెలుగు. ఆ వెలుగును నేను స్పష్టంగా చూడగలుగుతున్నాను.

ఇందుకోసమేనేమో! ఈ వెలుగు చూడడం కోసమేనేమో నేను అంత హడావిడిగా బయలుదేరి వచ్చాను.

ఈ స్పర్శ కోసమే అంత ఆత్రంగా వచ్చేశాను.

ఈ స్వర్గం కోసమేనేమో ఒక్క క్షణం కూడా నిలువలేక వచ్చి వాలిపోయాను.

అవును. ఈ స్వర్గంలోనే నాకు అన్నీను.

ఇటువంటి బంధాలేగా ఎన్నో వేల మైళ్ళ దూరాన్ని దాటుకుని మనుష్యులు వెళ్ళడానికి కారణాలు.

ఇటువంటి స్పర్శలేనేమో ఎన్నో సముద్రాలను దాటి వెళ్ళడానికి, అనుబంధాలను నిలవడానికి ఉత్ప్రేరకాలు.

అవును. నేను వీటికి అతీతురాలిని కాను.